# అరిచ్వెంద్రుడు




అరిచ్వెంద్రుడి పేరు ఆ ఊళ్లో ఎరగని వాళ్లు లేరు. కాని అతన్ని చూసిన వాళ్లు తక్కువ మంది మాత్రమే ఉన్నారు. అతని అవసరం కూడా అందరికీ రాదు. వచ్చినవాళ్లకి అతన్ని గురించి తెలుస్తుంది, రాని వాళ్లు 'వాడి అవసరం నాకు రాకూడదు' అనుకుంటూ దేవుడికి మొక్కుతారు.

అరిచ్వెంద్రుడు ఎక్కడ ఉంటాడో ఎవరికీ తెలియదు. పూజారి, సాతాని — ఇద్దరూ వాడిని గురించి ఆరా తీశారు. వాళ్లకయినా పూర్తిగా తెలుసునో తెలియదో కాని, అరిచ్వెంద్రుడిని గురించి అడిగిన వాళ్లకి వాళ్లిద్దరూ మాత్రమే సమాధానం చెప్పగలిగేవారు.

"వాడు మనిషనుకుంటున్నారా? ఏమిటో మీదంతా ఛాదస్తం. మూడు అమావాస్య రాత్రుళ్లు వాడిమీద పరిశోధన చేశాను. వాడు మనిషికాడు!" అనేవాడు, సాతాని.

"అబ్బే! గుళ్లో పూజలు జరిపేవాణ్ణి, నే నబద్ధ మాడుతాననుకుంటండీ? వాడు మనిషి కానేకాడు! అన్ని దెయ్యాల్లాగే వాడూను. పోనీ నా మాట అబద్ధమయితే చూసుకోండి, మీకు అవసరమైనప్పుడు తప్పితే వాడు కనిపిస్తాడేమోను?" అని ఊరి ప్రజల్ని భయపెట్టేవాడు, పూజారి.

వీళ్లిద్దరూ ఆ ఊరికి గాలిసోకినా, పూనకాలు వచ్చినా అర్చి తీర్చేవాళ్లు. అంచేత ప్రజల్లో అరిచ్వెంద్రుడిని గురించి ఒక విధమైన అభిప్రాయం ఏర్పడిపోయింది.

ఎవరన్నా అరిచ్వెంద్రుడి పేరెత్తితే ఆక్షణ్ణించి పిల్లల్నీ, ఆడవాళ్లనీ వెళ్లిపొమ్మనేవాళ్లు. అసలు, అంతకు ముందే వాళ్లు పారిపోయే వాళ్లు!

వరలక్ష్మీవ్రతం వచ్చినా, వినాయక చవితి వచ్చినా, మరే దేవుడి పండుగ వచ్చినా ఆడవాళ్లు ప్రార్థించుకొనేది ఒకటే ఒకటి — "మాకు అరిచ్వెంద్రుడి అవసరం రాకుండా చెయ్యి దేవుడా!" అని. ఉన్నవాళ్లు మంగళసూత్రం, లేనివాళ్లు ఫలహారాలు కళ్లకద్దుకుంటూ ఉండేవారు.

అరిచ్వెంద్రుడి అవసరం ఎప్పుడో ఒకప్పుడు అందరికీ వస్తుంది. అతని అవసరం రాకుండా తప్పుకుపోదామనుకోడానికి వీల్లేదు. అలాగని తెలిసి ఉండి కూడా ఆత్మ సంతృప్తికోసం 'రాదు' అనుకునేవాళ్లు.

* * *

ఆ ఊళ్లో గోపయ్య పేరుకూడా అందరి నోళ్ల లోనూ నానేదే.

గోపయ్య నిజంగా అపర కృష్ణుడిలాంటి వాడు. వాడు చేసే అల్లరి పనులకి లెక్క ఉండేది కాదు.

గుండ్రటి ముఖంలో చక్రాల్లాంటి కళ్లు, విశాలమైన నుదురు, ఉంగరాల జుట్టూ. రంగు నలుపయినా **ఎంతో** అందంగాను, ఆకర్షణీయంగాను ఉండేవాడు.

అందుకే వాడెన్ని అల్లరి పనులుచేసినా ఎవరూ ఏమీ అనేవారు కాదు. నవ్వుకునేవారు — అంతే! ఆ ఊళ్లో పిల్లల దగ్గిరనించి పెద్దవాళ్లదాకా — ఆడ, మగా— అందరికీ వాడంటే ప్రాణం.

అందం ఆకర్షణకి తగినట్టుగా, వాడొక వాగుడు కాయ. అస్తమానం నవ్వుతూ, పేలుతూ ఉండేవాడు. వాడికి తెలియని విషయమంటూ ఏదీ లేదేమోనని ఊళ్లోవాళ్లు అనుకునే వాళ్లు. ఏడేళ్ల కుర్రకుంకా వయస్సుకి మించిన తెలివితేటలతో అందర్నీ ముగ్ధుల్ని చేస్తుండేవాడు.

ఎవళ్లు ఏం చెప్పినా నిర్భయంగా పైకి అనేస్తు ఉండేవాడు. జంకూ గొంకూ ఉండేదికాదు.

మాటల్లోనేకాకుండా పనుల్లో కూడా వాడు ఎంతో ధైర్యం, సాహసం చూపిస్తూ ఉండేవాడు.

మట్టి కడుపులో మాణిక్యం పుట్టిందని — గుర్నాధాన్ని చూసి, గోపాయిని చూసి అందరూ అనుకుని అసూయపడుతూ ఉండేవారు.

తెల్లవారి లేచింది లగాయతు సాయంత్రం వరకు ఊళ్లో షికార్లుకొడుతూ ఎక్కడెక్కడో తిరుగుతూండే వాడు, గోపాయి.

* * *

ఆ వాగుడుకాయ గోపాయి నోరు మూసుకుని కూచుంటే చక్కగా ఉండిపోయేది. వాడి మాటల్లో యధార్థం ఎంతవరకోగాని "నాకు అరిచ్వెందురుడు కన్పింపాడు" అన్నాడు.

దాంతో వాళ్ల బామ్మ హడలిపోయింది. వాళ్లమ్మ సుబ్బమ్మ కంగారులో ఏంచేస్తోందో ఏమో ఆమెకే తెలియడంలేదు. ఇంటిల్లపాదీ బిక్కుబిక్కుమంటూ, బేలగా చూడడం ప్రారంభించారు. వాళ్ల నాన్న గుర్నాధం పైకండువా దులుపుకుని, పూజారికోసం పరిగెత్తాడు.

"ఏంరా ఎలా ఉంది? గుండె దడదడలాడుతూందా?" అంది బామ్మ గోపాయి మంచం దగ్గిరికి వచ్చి.

"అవునే . . . " అన్నాడు గోపాయి.

గుండె అసలు కొట్టుకుంటూందా! అనే ధర్మ సందేహం పుట్టి, అంతకుముందు కొట్టుకునేదికాదని, ఇప్పుడే కొట్టుకొనడం మొదలెట్టిందని వాడి ఊహ.

ఇదంతా అరిచ్వెంద్రుడు కనిపించిన దాని ఫలితమని బామ్మ అపోహ!

"ఇంకా కనిపిస్తున్నాడురా?" అంది అమ్మ సుబ్బమ్మ.

"అవునే . . . " అన్నాడు గోపాయి.

అన్నాడే గాని, వాడికి ఎవరూ కనిపించడంలేదు. కనిపించడంలేదంటే అమ్మ, బామ్మ ఊరుకోరు. మరో సవాలక్ష ప్రశ్నలువేసి చంపేస్తారు.

"అరిచ్వెంద్రుడు గాడు కొంప ముంచేశాడే. . ." అంది బామ్మ శోకానికి సిద్ధపడుతూ.

సుబ్బమ్మ గుండెలు బాదుకోవడం ప్రారంభించింది.

పూజారి, సాతాని పరిగెట్టుకు వచ్చారు.

కుర్రాడి నాడిని, కళ్లనీ, గుండెనీ అన్నిటినీ పరీ

ప్రించారు.

"అరిచ్చెంద్రుడు తిరుగుతున్నాడేమో చూసిరా" అని సాతానిని నియోగించాడు, పూజారి.

కనిపించడంలేదంటూ తిరిగి వచ్చాడు సాతాని.

విభూతి రాసి, జుట్టు ముడివిప్పి, "మరేం ఫరవా లేదు. వేపరొట్టె మంచానికి కట్టేను" అంటూ గోపాయి చెవులో మంత్రించి వెళ్ళిపోయాడు పూజారి. ఆ వెనకనే సాతాని, ఆ వెనక ఊరివాళ్ళందరూను.

* * *

అరిచ్చెంద్రుడు ఆ ఊరి అవతలి వల్లకాటికి కాపరి లాంటివాడు.

చెయ్యెత్తు భారీ విగ్రహం. నల్లని ఒళ్ళు. గోనె పట్టాలాంటి నల్లని గుడ్డ నడుంచుట్టూ కట్టుకోవడం తప్పితే వాడు వేరే గుడ్డ కట్టుకున్నట్టు ఎవరూ చూడ లేదు. కళ్ళు పత్తికాయల్లా పొడుచుకువచ్చి ఉంటాయి? జుట్టు తైలసంస్కారంలేక జడలు కట్టి తెగ బారెడు పెరిగి ఉంటుంది. చూడడానికి భయంకరంగా కనిపి స్తాడు. చేతిలో కఱ్ఱ ఎప్పుడూ ఉంటుంది. వాడు ఏం తింటాడో, ఎక్కడుంటాడో మాత్రం ఎవరికీ తెలి యదు. అది రహస్యం. పూజారి, సాతాని "వాడు మనిషి కాడు" అంటారు. నమ్ముతారు ఊళ్ళోవాళ్ళు.

ఆ ఊళ్ళో ఎవరు పోయినా వెంటనే వాడి చెవిన పడిపోతుంది. అప్పటివరకూ ఎవరికీ కనిపించడు. కాని శవాన్ని స్మశానానికి తెచ్చేటప్పటికి మాత్రం హాజరవు తాడు! వాళ్ళు స్మశానానికి వెళ్ళేటప్పటికి వాడూ ఆ ప్రాంతంలో తచ్చాడుతూ ఉంటాడు. అదే గ్రామస్థుల్ని ఆందోళనపరచిన విషయం.

ఊరికి రెండుమైళ్ళ దూరంలో ఉంది వల్లకాడు మురుగు కాలవపక్కన. అది పేరుకుమాత్రం మురుగు కాలువ గాని అందులో ఏటినీరే ప్రవహిస్తుంది. పాటూ పోటూ ఉంటాయి. దగ్గర దగ్గరగా ఒక ఎకరం నేల ఆవరించి ఉంటుంది స్మశానం. చుట్టూ కంచెలాంటి దేమీ ఉండదు గాని ముళ్ళపొదలూ అవీ దట్టంగా పెరిగి ఉంటాయి.

శవాన్ని తీసుకువచ్చిన వాళ్ళు అక్కడే మురుగు కాలవలోనే స్నానాలు చేస్తారు.

అరిచ్చెంద్రుడు ఆ ప్రాంతంవారికి ఎవరికైనా కనిపించాడూ అంటే "ఎవరో పోయారు. కాస్సేప ట్లోనో, కాస్సేపట్లోనో అక్కడకు తీసుకువస్తారు" అని అర్థం.

వాడు కనిపిస్తే చాలు ఆ ఊరికి కీడు అని అర్థం చెప్పుకున్నవాళ్ళు కూడా ఉన్నారు!

అరిచ్చెంద్రుడు ఆ వల్లకాటి నేలంతా క్షుణ్ణంగా ఎరిగినవాడు. కాపులకి ఏ ప్రక్కనో, బ్రాహ్మలకి ఏప్రక్కనో, రాజులకి ఏప్రక్కనో, మాలమాదిగల నెక్కడ ఉంచాలో — ఇలా కులాల వారీగా స్థలాల కేటాయింపు వాడికి కొట్టిన పిండి. ఒకళ్ళకు చెందిన స్థలం మరొ కళ్ళు ఆక్రమించుకోకుండా అరిచ్చెంద్రుడే వాళ్ళ వాళ్ళ నిర్దేశ స్థలాల్ని చూపిస్తూ ఉంటాడు. శవానిది పాతి పెట్టే వయసయితే గొయ్యి తియ్యడంలో కూడా వాడు సహాయపడతాడు. ఇక కాల్చడు వసయితే పూర్తిగా వాడే చూసుకుంటాడు.

అరిచ్చెంద్రుడు ఎవరిదగ్గిరా డబ్బు తీసుకోడు. అదీ అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. బియ్యం ఇస్తే పుచ్చుకుంటాడు; పప్పులిస్తే పుచ్చుకుంటాడు; అన్నం పెడితే తింటాడు. ఇస్తే పుచ్చుకోవడమేకాదు. ఆ సరం జామాని వాడి కిచ్చితీరాలి. అంతే.

స్మశానంలో శ్రాద్ధకర్మలూ అవీ జరిగినప్పుడు వాడి వాటా వాడికి అక్కడే ఉన్న ఒక సమాధి గచ్చునేల మీద ఉంచి వెళ్ళిపోతూంటారు. వారానికోసారి ఊళ్ళో అందరూ ఒకరితరవాత ఒకరు చొప్పున వంతువేసుకొని వండిన పదార్థాలు అక్కడ పెడుతూ ఉంటారు. అది ఆ ఊళ్ళో ఆచారం. సత్తెయ్య మామ సలహాతో పూజారి ఈ ఏర్పాటు చేయించాడు. మరుక్షణంలో ఆ పదార్థాలన్నీ మాయమైపోతూ ఉండడం కూడా ఒక విచిత్రం!

అరిచ్చెంద్రుడు ఎవరితోనూ మాట్లాడడు. పలక రిస్తే పలుకుతాడు. లేకపోతే లేదు.

తల నెరిసినవాళ్ళు అతణ్ణి పిలిచి — "మీ కుర్రా డెలా ఉన్నాడు?" అని అడుగుతారు.

"వాడికేం మారాజులా ఉండాడు. రేపో మాపో పెళ్ళికూడా సేసేత్తాను" అనేవాడు, అరిచ్చెంద్రుడు.

అలా అంటున్నప్పుడు వాడిలో ఒకవిధమైన ఆనందం కనిపించేది. గర్వం పొడచూపేది.

"పాపం! పిచ్చివాడు!" అనుకునేవాళ్ళు, కుర్రకారు.

"లెంపలేసుకో, పిచ్చివాడేమిటి? గ్రామదేవత నలా అనకూడదు. పెళ్ళిచేసెయ్యాలంటే మనందరం సుఖంగా ఉండాలని వాడి కోరిక." అని వ్యాఖ్యానించే వాళ్ళు పెద్దలు!

"మీ నాన్న ఎవరూ?" అని అడిగితే —

"అరిచ్చెంద్రుడు" అంటాడు అరిచ్చెంద్రుడు.

"మీ తాత?" అని అడిగినా అదే సమాధానం.

వాళ్ళ వంశం అంతా హరిచ్చెంద్రుడి వంశమే అన్న ట్టుగా చెబుతాడు.

"పెళ్ళాన్నేంచేశావు?" అన్నప్పుడు మాత్రం భోరు మని ఏడుస్తాడు!

ఇంక వాడిని మాటాడించడం ఎవరి తరమూ కాదు.

* * *

సుబ్బమ్మ ఆరోజు ప్రొద్దున్న మామూలుగానే లేచింది.

ఇల్లంతా తుడిచి కళ్ళాపివేసి ముగ్గు పెట్టేసరికి పొద్దు పొడిచింది. కుర్రకుంక గోపాయిని లేపుదామని వెళ్ళింది. వెళ్ళింది వెళ్ళినట్టే ప్రమాస్పడి పోయింది.

*ఇదిగో పులి అంటే అదిగో తోక అంటారు. పుకార్లు గాలికంటె వేగంగా పరుగుదీస్తాయి. పల్లె పట్టులలో మరీని. చిలవలు, పలవలై కథలు గాథలై, పలువురికి బాధలుగా మారినా, నిజం మాత్రం నివురుచాటున దాగి ఉంటుంది. ఎవరో ఒక నిరపరాధ పరిశోధకుడు బయటపెడితే, ఔరా అని అప్పుడు ఔడు కరుచుకుంటారు.*

**బి. సీతారామమూర్తి**

"గో . . పా . . య్యే . . ." అంటూ కొంప మునిగినంత గట్టిగా అరిచింది.

ఇంటిల్లిపాదీ అదలాబాదరాగా లేచి అక్కడికి పరు గెత్తుకు వచ్చారు.

"ఏం జరిగిందే?" అన్నాడు గుర్నాథం

"గోపాయి కనిపించడం లేదండీ" అంది సుబ్బమ్మ.

అందరికీ భయంవేసింది. గోపాయి అరిచ్చెంద్రుణ్ణి చూశానసడము, ఆ తరవాత జరిగిన గొడవా ఒక్కసారి అందరి మనస్సుల్లోనూ మెదిలింది.

అందరూ ఏడుపు లంకించుకున్నారు. గుర్నాథం పిచ్చివాడిలా తిరగ నారంభించాడు.

గోపాయి అప్పుడే వచ్చాడు. వచ్చి, వాళ్ళతోకలిసి, సంగతి తెలియక వాడూ ఏడవడం ప్రారంభించాడు.

ఊరంతా అక్కడ పోగవుతున్న సమయంలో బామ్మ తెప్పరిల్లి అరిచింది.

గోపాయిని సజీవంగా చూసి అందరూ ఆశ్చర్య పోయారు.

"ఎక్కడికి వెళ్ళావురా?" అడిగింది సుబ్బమ్మ.

"అరిచ్చెందురిడి దగ్గిరికి" అన్నాడు గోపాయి.

అదిరిపడ్డారు అందరూ.

తేరుకున్న బామ్మ నిలువుగుడ్లు వేసింది.

సుబ్బమ్మ చైతన్యం ఉడిగి నిల్చింది.

"ఎ. . . త్తు . . . డి . . . కీ ... ?" అన్నాడు నత్తినత్తిగా గుర్నాథం.

గోపాయికి విసుగేసింది.

"చెప్పానుగా అరిచ్చెంద్రుడి దగ్గిరికని" అన్నాడు.

అందరూ మనుష్యుల్లోకి తిరిగి రావడానికి కొన్ని నిమిషాలు పట్టింది. బామ్మ వేపాకుతో తయారయింది.

సుబ్బమ్మ పసుపు అన్నం కలిపి దిష్టి తియడానికి ఆయత్తమయింది.

గుర్నాథం గోచీ బిగించుకుంటూ పూజారి దగ్గిరికి పరిగెత్తాడు.

అరిచ్చెంద్రుణ్ణి గురించి అనేక రకాల పుకార్లు ఉన్నా, ఇటువంటి సంఘటన జరగడం ఇదే కొత్త. అందువల్ల ఊళ్ళో జనమంతా భయపడి పోసాగారు.

అరిచ్చెంద్రుడు ఎప్పుడన్నా పెద్దవాళ్ళకి కన్పించినా ఏదోలే అని తేలిగ్గా వదిలేసేవారు. ఇప్పుడు పిల్లలకి కూడా కన్పిస్తున్నాడంటే ఊరు ఊరంతా చిత్రెత్తి పోతూంది. కనిపిస్తే చాలు వాణ్ణి ముక్కలు ముక్కలు చేసేద్దామనుకుంటున్నారు.

"వాడు మనిషయితే కదండీ చంపేందుకు? వాడిని చంపాలంటే మాటలా? బోల్డంత కర్చుతో పని. నే నెప్పటినించో చెబుతూనే ఉన్నాను. వాణ్ణి పరి మార్చాలి. లేకపోతే ఊళ్ళోవాళ్ళకి ఎప్పటికయినా చెరుపు అని. నేను అంత గోల పెడుతూంటే మీరు వింటేనా?" అంటూ ఇంట్లో ప్రవేశించాడు పూజారి.

వస్తూనే గోపాయి జుట్టు మూడు చిన్నపాయలు చేసి, జడ వేసి, ముడివేశాడు.

"ఎక్కడికెళ్ళావు నాయనా?" అన్నాడు.

"అరిచ్చెంద్రుడి దగ్గిరికి" అన్నాడు గోపాయి.

జడ వేళ్ళకి ముడి వేసి బిగించాడు పూజారి.

"ఎక్కడి కెళ్ళానంటావ్?" అని మళ్ళీ అడిగాడు.

"అమ్మా!. . ." అని అరిచి, "మా నాన్న దగ్గిరికి" అన్నాడు గోపాయి.

"ఎవరు మీ నాన్న?" అడిగాడు పూజారి.

"అరిచెంద్రుడు" అన్నాడు గోపాయి.

గుర్నాథం సుబ్బమ్మవైపు కళ్లురిమి చూశాడు.

బొమ్మ లబో దిబో అంది.

అంతే. పూజారి గోపాయిని విడిచి పెట్టేశాడు.

"అదీ కథ. . ." అంటూ గట్టిగా ఊపిరి పీల్చుకుని, తమలపాకులకి సున్నం రాసుకోడం మొదలు పెట్టాడు పూజారి.

* * *

"మునసబుగారు పోయారంట" అన్నాడు వెట్టివాడు.

'పాపం!' అనుకున్నారందరూ.

"ఎంత గట్టిమనిషి! అంత తొందరగా పోయాడేమిటి చెప్మా?" అన్నారు కొందరు. . .

ఎనభయ్యేళ్లవాడు పోయాడంటే ఆశ్చర్యం లేదు. కాని ఈ మధ్య ఆ ఊరి వాతావరణంలో పెద్దమార్పు వచ్చింది. ప్రతిదానికి అనుమానపడుతున్నారు; ఆరా తీస్తున్నారు.

రంగంలోకి అడుగుపెడుతున్న పూజారి "నే చెప్పలేదూ. . .! అయిపోయింది! అనుకున్నంతా అయిపోయింది. ఇంకా ఎవర్ని బలి తీసుకుంటాడో. . .!" అన్నాడు.

"ఖర్మకి వెనుదీస్తే కీడెలా పోతుందండీ?" అంటూ తందాన పాడాడు, సాతాని.

పూజారి ఖర్మమాటలు ఇప్పుడిప్పుడే ప్రజల్లో నాటుకోవడం మొదలుపెట్టాయి.

మునసబుగారి శవానికి స్నానం చేయించి కటిక మీద పడుకో బెడుతున్నారు.

ఊరికి రెండో పెద్ద, కరణం ప్రాణభయంతో విలవిల్లాడిపోయాడు.

పూజారి దగ్గిరికి హుటాహుటిని వచ్చి "ఊళ్లో చందాలు పోగుచేద్దాం. కానీయండి. . . తొందరలో మీ పూజ ప్రారంభించండి" అన్నాడు.

పూజారి అభయహస్తమిచ్చాడు.

"హరహర మహాదేవ. . . శంభోశంకర!" అంటూ ఏడుకట్ల సవారీ ఎత్తుకున్నారు.

ఒకళ్ల తరవాత ఒకళ్లు మార్చుకుంటూ స్మశానం దాకా తెచ్చారు. శవాన్ని మురుగుకాలవ ఒడ్డున పెట్టి చాలా సేపటివరకు అరిచెంద్రుడి కోసం ఎదురు చూశారు.

ఎక్కడా కనిపించడం లేదు!

"చూశారుగా మీ రలా మాటిచ్చారు, నే నలా మంత్రాలు ప్రారంభించాను. అరిచెంద్రుడు హడిలి చచ్చాడు" అన్నాడు పూజారి.

అలా అంటున్నప్పుడు అరిచెంద్రుడు అతని వెనకనే నిలబడి ఉన్నట్లు అతనికి తెలియదు.

తక్కినవాళ్లు మాత్రం భయంతో కళ్ళూ చెవులూ మూసుకున్నారు.

తరవాత అరిచెంద్రుణ్ణి చూసి "తత్తెత్తె. . . వన్నెన్నె. . ." అన్నాడు. ఎవరికీ వినిపించకుండా పూజారి.

అరిచెంద్రుడు అతన్ని ఏమీ అనలేదు. కాస్సేపు పత్తికాయలమీద ఆచ్ఛాదన లేకుండా చూశాడు. అంతే!

తరవాత కార్యక్రమం అంతా యథాప్రకారంగా జరిగిపోయింది.

అంతవరకూ ఎవరూ పన్నెత్తయినా మాట్లాడ లేదు. ఎవరి మట్టుకు వారే భయం భయంగా ప్రాణాలు అరిచేత్లో పట్టుకు కూర్చున్నారు.

అంతా అయిపోయాక ఇళ్లకు తిరిగి వస్తూ. . .

"ఏం చేద్దామంటావ్. . .?" మౌనాన్ని ఛేదిస్తూ పూజారితో అన్నాడు, కరణం.

"మీరలా చూస్తూ ఉండండి. నే చెప్తాగా." అన్నాడు పూజారి. అతని మాటలతో అందరూ కొంత ధైర్యం తెచ్చుకున్నారు.

"అసలు వీడెక్కణ్ణించి వచ్చాడంటావ్?"

"అదెవరికి తెలుస్తుంది?"

"పోనీ ఎప్పటినించి ఉంటున్నాడో. . .?"

"అదీ మనకు తెలీదు. సత్తెయ్య మామకు తెలుస్తదేమో అడుగుదాం."

"ఏం సత్తెయ్య మావా! వీడు ఎప్పటినించి ఉంటున్నాడో ఏమన్నా నువ్వు చెప్పగలవా?"

కాస్సేపు ఆలోచించాడు. తరవాత అన్నాడు:

"నాకు మాత్తరం ఏం తెలుసుద్దిరా? నా సిన్నతనంలో ఇలాంటోళ్లు ఎవరూ ఉన్నట్టు లేరు. మా అయితే మీ తరంలోనే వచ్చి ఉండాల." అన్నాడు, సత్తెయ్యమామ.

"చూస్తుంటే అలానే అనిపిస్తూంది. అంతా కలిపి నలభయ్యేళ్లకి మించి ఉండవు."

> **తప్పులు**
>
> **ఇతరులు చేసిన తప్పులు ఆధారంగా తెలివైనవాడు తన తప్పులను దిద్దుకుంటాడు.**
>
> —పబ్లియస్ సైరస్

"అవునురా. . .! నేనోసారి వాణ్ణి కదిపి సూశా. పైకి కన్పించినంత గోరంగా నేదు వాడి మనసు. మంచోడే! పిచ్చోడేమోనని నాకు అన్మానం."

"ఆఁ. . . మీదంతా ఛాదస్తం. వాడు పిచ్చోడేమిటండీ? మూడు రాత్రుళ్లు వాడిమీద సరిశోధిస్తేనూ!. . . వాడు మనిషి కాడు. అంతే!"

"అయితే గుర్నాధంకొడుకు అలా అంటాడేమిటి?"

"మరి సుబ్బమ్మ. . .!"

"ఛ . . . ఛ. . . అలా అంటే కళ్లు పోతాయ్. . . దెయ్యానికి మనిషికి సంబంధాలేవిటి?" అన్నాడు కరణం.

"అక్కడే మీ రంతా పొరపడేది. దెయ్యాలతో వ్యవహారమంటే మజాకా అనుకుంటున్నారా?" అన్నాడు పూజారి, అందులో రహస్యం తన కొక్కడికే తెలిసినట్టు.

అందరూ కుతూహలంగా అతనివైపు చూశారు.

"అయితే ఏమిటంటావ్?" అన్నాడు కరణం ఆగలేక.

"ఏముంది? మీ చిన్నతనంలోనూ, నా చిన్నతనం లోనూ అచ్చయ్య, వాడి కొడుకూ ఉండేవారు. గుర్తుందా?"

"అవును. . ."

"వాళ్లేమయ్యారు?. . ."

"ఇల్లంటుకుని అందులో కాలిపోయారు."

"అచ్చయ్య పెళ్లామేమైంది?"

"ఎవరికి తెలియదు గనక? అచ్చయ్యతో పెళ్లయిన మూడో నాడే ఎవడితోనో లేచిపోయింది."

"అదీ పాయింటు" అన్నాడు పూజారి.

తక్కినవాళ్లకు సరిగా అర్థం కాలేదు.

"అచ్చయ్యే అరిచెంద్రుడు. వాడి కొడుకు గుర్నాధం కొడుకును ఆవహించాడు. అదీ కథ" అన్నాడు.

పూజారిమాటల్ని కొట్టిపారెయ్యడానికి ఎవరికీ దమ్ములేకపోయాయి.

"ఇంత కాలం నుంచీ లేంది ఇప్పుడే ఎందుకు చెలరేగుతున్నారు, అరిచెంద్రుడూ వాడి కొడుకూను?" అన్నాడు సత్తెయ్యమామ ఈసడింపుగా.

"అద్గదీ ... అక్కడే ఉంది తమాషా అంతా. ఈ రహస్యం నేను ఛేదిస్తా. కానయితే కొంచెం ఖర్చవుని. మనుషులికి మనుషులికీ అయితే ఫరవాలేదు గాని. . . దెయ్యాలికీ దెయ్యాలికీ అయితే కొంచెం ఖర్చుమాటే మరి!. . ." అన్నాడు పూజారి.

● ● ●

మరునాటినుంచి ఊళ్లో అందరి దగ్గిరా చందాలు పోగుచేయడం ప్రారంభించారు.

వారం రోజులు తిరక్కుండానే అనుకున్న దానికంటే ఎక్కువ డబ్బే పోగయిందని సంతోషించాడు, పూజారి.

సాతాని ఒక పెద్ద మట్టిబొమ్మని, మరో పిల్లాడి బొమ్మని తయారు చేయడంలో నిమగ్నమైపోయాడు.

ఊరు ఊరంతా గోపాయిని పలకరించినవాళ్లే. అరిచెంద్రుడిని గురించి వివరాల్ని అడిగి తెలిసికొన్న వాళ్లే.

వాళ్లడిగిన ప్రశ్నలన్నింటికి గోపాయి సమాధానాలు చెప్పలేక పోయేవాడు. వాడికి మాత్రం ఏం తెలుసును గనక?

"తెలియదు", "తెలియదు" అంటూ అడిగేవాళ్లని నిరుత్సాహపరిచేవాడు.

"ఇంకా కావాలంటే పూజారి తాతయ్యకూడా చూశాడు. ఆయన్ని అడిగి తెలుసుకోండి" అనేవాడు.

అరిచెంద్రుడిని గురించి ప్రజలు అనేక రకాలుగా అనుకోవడం గోపాయి వింటూనే ఉన్నాడు.

తను అరిచెంద్రుణ్ని చూశానన్నప్పటినించి గ్రామంలో మరింత అలజడి రేగింది.

పూజారి పరపతి ఒక్కసారిగా పెరిగిపోయింది.

గోపాయికి పూజారి చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి. పూజారి అంటే గోపాయికి అభిమానం. ఉదయాన్నే గుడికి వెళ్లగానే ప్రసాదంలో మొట్టమొదటి వంతు గోపాయిదే!

ఆ విలవ కాపాడుకునేందుకు గోపాయి పూజారి మీద అందరికంటే ఎక్కువ ప్రేమ కనబరుస్తూ ఉంటాడు.

పూజారి మాటలవల్ల ఊళ్లో జనం పుకార్లవల్ల, గోపాయికి అరిచెంద్రుడంటే భయం ఏర్పడినమాట నిజమే. కాని పూజారిని తలుచుకుని భయపడడం మానేసేవాడు.

దానివల్ల వాడిలో ఒక కొత్త రకం ఉత్సాహంకూడా బయలుదేరింది. ఆసక్తిని రేకొల్పింది.

ఎండ నిప్పులు చెరిగిపోస్తున్న వేళ అది. అందరూ తలుపులు బిడాయించుకుని, గొడ్డులనుంచి కాచుకుంటున్నారు. చెవుల్లోనించి వేడిగాలి చొచ్చుకుపోతూ

జనాన్ని ఉడికించేస్తాంది.

గోపాయిని విడిచిపెట్టడానికి సుబ్బమ్మ ఒప్పుకోలేదు. కాని గోపాయి మొండితనం, మంకుపట్టు సుబ్బమ్మకి తెలియనివి కాదు.

పూజారి "పూజలు చూడకూడని వేవీ లేవు. అందరూ చూడవచ్చు" నంటూ అందరికీ బహిరంగంగా చూపిస్తూనే ఉన్నాడు. "ఎప్పుడయినా గ్రామదేవతల్ని శాంతపరచవలిసివచ్చినప్పుడు మాత్రం రాత్రుల్లో పూజలు జరుపుతాను. మిగతాదంతా పగలే. అంచేత అందరూ వచ్చి చూడచ్చు" అంటూండేవాడు.

పైగా గోపాయి తన దగ్గిరుంటేనే మంచిదనే వాడు, పూజారి.

పూజారి దగ్గిరికి వెళుతున్నానని చెప్పి, వాళ్ల బామ్మ బతిమాలినా, వినిపించుకోకుండా బయలుదేరి గ్రామం అవతలికి ఒంటరిగా నడిచి వచ్చేశాడు, గోపాయి.

ఎండ తీవ్రంగా ఉండడంచేత జనసంచారం అంతగా లేదు. అసలు ఆ సమయంలో ఆ చుట్టుప్రక్కల ఎవరూ ఉండనే ఉండరు. మిట్టమధ్యాహ్నం, రాత్రుళ్ళ అక్కడ దెయ్యాలు తిరుగుతాయని గ్రామస్థుల నమ్మిక.

గోపాయి ముళ్లపొద చాటున నిలబడి స్మశానాన్ని అంతటినీ పరిశీలించి చూశాడు.

వాడికి ఎలాంటి విచిత్రమూ కనిపించలేదు. అంతా మామూలుగానే ఉంది. లోపలికి వెళదామనుకున్నాడు.

అంతలోనే ఒక దృశ్యం వాడి కళ్లబడింది—

స్మశానం మధ్యలో ఒక సమాధి ఉంది. ఆ సమాధి మీద ఉన్న రాతి పలక ఒకటి కదలడం ప్రారంభించింది.

భయంవేసినా, ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి గోపాయి భయాన్ని అదుపులో పెట్టేసింది.

కొంతసేపటికి రాతి పలక పూర్తిగా తొలగిపోయింది. సమాధిలోంచి ఒక మనిషి బయటికి వచ్చాడు!

వాడిని చూస్తూనే 'అరిచ్చెందురుడు!' అని వెంటనే పోల్చేసుకున్నాడు, గోపాయి.

అరిచ్చెంద్రుడు అని ఎప్పుడయితే పోల్చుకున్నాడో అప్పుడే వాడిలో విపరీతమైన భయం ప్రవేశించింది.

నిలువెల్లా వణికిపోయాడు! . . . భయంతో కెవ్వుమని గట్టిగా అరిచాడు! అక్కడే పడిపోయాడు!

పొలంపని చూసుకుని ఇంటికి తిరిగి వస్తున్న సత్తెయ్యమామ గోపాయి కేక వినిపించి అటు పరుగెత్తుకు వచ్చాడు.

పడిఉన్న గోపాయిని ఎత్తుకుని స్మశానం వైపు చూశాడు.

అప్పుడే రాతి పలక పూర్తిగా మూసుకుపోతూఉంది.

అతనికి వెంటనే ఏదో స్ఫురించింది. అతను లాపీపని చేసిన రోజులు గుర్తుకు వచ్చాయి.

అలానే ఒక నిమిషంసేపు చూసి, గోపాయిని భుజాన వేసుకుని, గుర్నాధం ఇంటికి తీసుకువచ్చాడు.

కుర్రాణ్ణి ఒంటరిగా వదిలినందుకు గుర్నాధాన్ని చీవాట్లు పెట్టి పిల్లాడి పరిస్థితిని విడమర్చి చెప్పాడు.

ఇంట్లో వాళ్ల భయానికి అంతులేకపోయింది. ఈ విషయం ఊళ్లో అందరికీ ఇట్టే తెలిసిపోయింది. ఊరంతా ఒకటే గొడవ!

పూజారి పరిగెత్తుకు వచ్చి జరిగిన విషయం తెలుసుకుని, ఎంతో బాధపడ్డాడు. అవీ ఇవీ మంత్రించి నానా హంగామా చేశాడు.

"నేను నిజంగా అరిచ్చెంద్రుణ్ణి చూశా" అన్నాడు గోపాయి.

పూజారి కంగారుపడ్డాడు.

ఆ రోజు గోపాయికి జ్వరం తగిలింది. మరునాడు ఇంకా హెచ్చింది. మూడోనాడు ఊరివారందరికీ శాశ్వతంగా దూరమైపోయాడు గోపాయి.

ఊళ్లోవాళ్లల్లో — అరిచ్చెంద్రుణ్ణి హతమార్చాలనే కసి ఎక్కువయిపోయింది. తోక తొక్కిన తాచు పాముల్లా లేచిపోయారు.




గోపాయి శవాన్ని స్మశానానికి తీసుకువెళ్లారు.

ఎంతసేపటికి అరిచ్చెంద్రుడు కనిపించలేదు!

ఊరు ఊరంతా గగ్గోలుగా ఉంది. ఈ రోజు అరిచ్చెంద్రుడు పని హరీ అనుకుంటున్నారు అందరూ...

మగవాళ్లంతా కత్తులూ కఠార్లతో, బాణాకర్రలతో, పారా గునపాలతోనూ — ఎవరికేది దొరికితే అది పుచ్చుకొని వల్లకాట్లో అడుగుపెట్టారు.

ఎంతసేపటికి అరిచ్చెంద్రుడు రావడం లేదు.

"ఇక రాడు" అన్నాడు పూజారి.

పూజారి ఇప్పుడు ఎంతో భయపడుతున్నాడు!

జరిగినదాని కన్నా జరిగేదాన్ని ఊహించుకొని మరీ భయపడిపోతున్నాడు.

గ్రామస్థుల్ని ఊరడించే శక్తి ఇప్పుడతనిలో సన్నగిల్లింది. ఆయాసంగా ఒక చోట కూర్చుండిపోయాడు. అతనికి కాళ్లూ చేతులూ ఆడడంలేదు!

అందరూ సత్తెయ్య మామచుట్టూ మూగారు.

"చెప్పు! . . . చెప్పు! . . . చెప్పు!. . . " అని ఒకటే గోల.

"నేను చెప్పన్రా — చెప్పను" అని మొండికేశాడు, సత్తెయ్య మామ.

"వీల్లేదంటే వీల్లేదు — చెప్పి తీరాలి" అన్నారందరూ.

సత్తెయ్య మామకి ఏం చెయ్యడానికీ పాలుపోలేదు.

చివరికి తప్పేలా లేదని, ఏమి జరిగితే అదే జరుగుతుందని సమాధిని వేలితో చూపించాడు.

దండు దండంతా సమాధి దగ్గిరికి పరుగెట్టారు.

దాన్ని చిన్నాభిన్నం చేసేశారు.

లోపల ఒక సొరంగం ఉంది. ఆ సొరంగంలోనుంచి అదొక రకమైన వాసన రా నారంభించింది.

లోపలచూస్తే ఎవరో మనుషులు ఉంటూన్నట్టుగానే ఉంది.

అందరూ — ఒకరి వెనుక ఒకరు లోపలికి వెళ్లారు.

అక్కడి దృశ్యాన్ని చూసి అందరూ నిశ్చేష్టులుగా నిలుచుండిపోయారు!

వెళ్లగానే వాళ్లకు కనిపించింది — నిల్చొని ఉన్న ఒక అస్థిపంజరం!

అరిచ్చెంద్రుడు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. రాతిమీద ఉన్న అతని తలలోంచి రక్తం ఇంకా కారుతూనే ఉంది!

ఆ ఎముకలగూడు కాళ్ల దగ్గిర అరిచ్చెంద్రుడి తల ఉంది.

"ఏందిది పూజారి? !" అన్నారందరూ పూజారి వైపు తిరిగి.

"పూజారేం సెబుతాడెహె ... నే సెబుతా ఇనండి. ఈ సమాధి రత్తమ్మది. రంగనాయకులు దగ్గిరుండి కట్టించాడు. కొడుకునుకూడా ఇందులోనే పాతించాడు. రంగనాయకులు పిచ్చివాడై ఎటో పోయాడనుకున్నామే. . . . . ఆ డెక్కడికీ పోలేదు. ఆడే ఈ అరిచ్చెంద్రుడు. ఆడిలాంటి పిచ్చి ఎవళ్లకీ రాకూడదు. పాపం చేశారు. పొండి. పోయి మొక్కుకోండి" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ, సత్తెయ్య.

రంగనాయకులు రత్తమ్మని అనుమానించి, ఆనాడు దారుణంగా హత్యచేసిన సంఘటన అతని కళ్లముందు మెదిలింది.

పూజారి ముఖం వెలవెలబోయింది!

ఊరు ఊరంతా తెల్లబోయింది! ★